క్లుప్తంగా

క్రీడలతో వికాసం



నర్సంపేట రూరల్ : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని నర్సంపేట టౌన్ సీఐ ఎల్.రఘుపతిరెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని రాజపల్లిలో గురువారం నిర్వహించిన ఖో–ఖో, వాలీబాల్ క్రీడాపోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని చెప్పారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సన్మార్గంలో పయనిస్తూ ఇతరులకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గూడ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

11న అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



నర్సంపేట : ఈనెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్లు చెన్నారావుపేట తహసీల్దార్ ఆబిద్ అలీ, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎంఈఓ బైరి సరళ తెలిపారు. చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో తహసీలాదర్, ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడారు. నులి పురుగు నిర్మూలన కార్యక్రమ విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3 నుంచి 19 ఏళ్ల వరకు వయస్సున్న పిల్లలకు అల్బెండాజోల్ మాత్ర వేయాలని చెప్పారు. సమావేశంలో సీహెచ్ఓ భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల అహ్వానం

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికా కళాశాల (కేజీబీవీ)లో ఆంగ్లని విభాగంలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్లుగా బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్న ప్రిన్సిపాల్, స్పెషల్ ఆఫీసర్ కరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 8 నుంచి 120 తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కళాశాలకు వచ్చి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 96185 13384లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ నాయకుడి మృతి

నర్సంపేట : పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఠాకూర్ రవీందర్ సింగ్ (52) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల అధ్యక్షుడు అంబేడ్కర్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో దాన్ని నడుపుతున్న తాండ్ర బాబుకు గాయాలయ్యాయి. బాబు వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పింది. దీంతో బాబు రోడ్డు పక్కనే ఉన్న ముళ్లపొదల్లో పడిపోయాడు. స్థానికులు గమనించి ఆయన్ను ఆస్పత్రికి తరలించారు.

ధర్మారంలో..

గీసుకొండ : మండలంలోని ధర్మారంలో వరంగల్–నర్సంపేట రహదారిలో స్థానిక కిరాణా షాపునకు నడుచుకుంటూ వెళ్తున్న చెరువు మోషాను వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోషా గాయాలపాలు కాగా అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మోషా కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావికి చెందిన కూస రాజు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు గురువారం రూ.50 వేల సాయం అందించారు. తొలుత రాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య సమతను, కుమార్తెలు నవ్యశ్రీ, దివ్యశ్రీలను పరామర్శించి నగదు అందజేశారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు ముత్యాల స్వామి, బొగ్గుల దేవేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ లబ్ధిదారుల వెతలు

- ‘ఆధార్’ నమోదులో పొరపాట్ల వల్లే..

సంగెం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టి నెలలు గడుస్తోంది. పలువురి ఇళ్ల నిర్మాణాలు స్లాబ్, లెంటల్ లెవల్‌కు చేరుకున్నాయి. బిల్లుల కోసం సుమారు నెల రోజులుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్న దుస్థితి నెలకొంది. మండలానికి చెందిన పలువురు ఆధార్ నంబర్ నమోదు చేయడంలో చోటు చేసుకున్న పొరపాట్ల వల్ల యాప్‌లో లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.

మండలంలో 632 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వారిలో 585 మందికి అధికారులు ప్రొసీడింగ్స్ అందజేశారు. వారిలో 134 చేపట్టిన ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు, 11 మందికి చెందిన ఇళ్లు రూఫ్ లెవల్, నలుగురి ఇళ్లు స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాయి. కాగా ఇప్పటి వరకు 149 మంది లబ్ధిదారులకు బేస్‌మెంట్ లెవల్ నిర్మాణానికి సంబంధించి మొదటి విడత కింద బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ అయ్యాయి.

ఆధార్ నంబర్ల నమోదులో పొరపాట్లు

ఇందిరమ్మ లబ్ధిదారులకు కొత్త సమస్య తలెత్తింది. ఇళ్ల నిర్మాణం బెడ్ లెవల్ పూర్తి అయి నెల రోజులు



బెడ్ లెవల్ పూర్తి అయిన ఇంటి వద్ద లబ్ధిదారు

గడుస్తున్నా కొందరి ఆధార్ నంబర్లు తప్పుగా నమోదు కావడంతో ఫొటో క్యాప్చర్ కావడం లేదు. వారికి మొదటి విడత బిల్లు మంజూరు కావడం లేదు. బెడ్ లెవల్ వరకు నెట్టుకొచ్చిన లబ్ధిదారులకు బిల్లు అందకపోవడంతో నిర్మాణాన్ని ముందుకు కొనసాగించలేని దుస్థితిలో ఉన్నాయి. మండలానికి చెందిన ఎనబోతుల స్వప్న (ఎల్గూర్ రంగంపేట), కత్తుల పావని (రామచంద్రాపురం), బెజ్జాల పెద్ద సరోజన (గాంధీనగర్), తాళ్లపెల్లి సారయ్య (నార్లవాయి), నూనె సూరమ్మ, బుట్టి రేణుక, పత్తిపాక భాగ్యలక్ష్మి (గవిచర్ల), బాదావత్ జమున (చింతలపల్లి), మునుకుంట్ల సరిత, పేర్ల లావణ్య, ఉండీల రాధిక తదితరులకు చెందిన ఆధార్ నంబర్లు తప్పుగా నమోదైనట్లు అధికారులు నిర్ధారించారు. సమస్యను పరిష్కరించి బిల్లులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని లబ్ధిదారులను కోరుతున్నారు.

అప్పు చేసి నిర్మిస్తున్నా

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో అప్పు చేసి నిర్మాణం చేపట్టాము. బెడ్ లెవల్ వరకు నిర్మాణం జరిగి నెల రోజులు గడుస్తోంది. నిబంధనల మేరకు ఇప్పటికే మొదటి విడత రూ.లక్ష రావాల్సి ఉంది. ఆధార్ నంబర్ తప్పుగా నమోదు కావడంతో ఇప్పటివరకు బిల్లు అందలేదు.

– పేర్ల లావణ్య, లబ్ధిదారు, సంగెం

సమస్యను పరిష్కరిస్తాం

మండలానికి చెందిన కొందరు లబ్ధిదారుల ఆధార్ నంబర్ల నమోదులో పొరపాట్లు చోటు చేసుకున్నాయి. వాటిని త్వరితగతిన సవరిస్తాం. బాధితుల ఆధార్, ఇళ్ల నిర్మాణ స్టేటస్ వివరాలు ఏఈ, డీఈ ద్వారా నమోదయ్యాయి. వాటిని సత్వరమే పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

– గణపతి, పీడీ, హౌసింగ్ శాఖ

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



నర్సంపేట : మార్కండేయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు

నర్సంపేట : పట్టణంలో పద్మశాలి సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు గాజుల సాంబయ్య అధ్యక్షతన జాతీయ చేనేత దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి సాంబయ్య, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాంబయ్య, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాంపెల్లి లింగమూర్తి మాట్లాడారు. చేనేత వస్త్రాలను సమాజం ధరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బాసాని సుదర్శన్, బలభద్ర రవీందర్, పెండెం వెంకన్న, ఆడెపు చంద్రశేఖర్, బంక పరమేశ్, తుమ్మ ఏకాంబ్రం, ఆడెపు రమేశ్, గుల్లపెల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో అరుణోదయ చేనేత సంఘం కార్మికులను స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం విద్యార్థులకు చేనేత వృత్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెల్దండి సుమలత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి



సంగెం : మండలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆదేశించారు. మండలంలోని కుంటపల్లిలో గురువారం నిర్వహించిన సర్వేను ఆయన సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. మండలంలో 4726 ఎల్1 దరఖాస్తులు రాగా కేవలం 349 దరఖాస్తులను మాత్రమే సర్వే చేశారని తెలిపారు. నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాజీద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నర్సింహ ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు వడ్డెపల్లి రమ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుపై అడవి జంతువు దాడి..?

నల్లబెల్లి : ఎద్దుపై అడవి జంతువు దాడి చేసిన ఘటన మండలంలోని కొండాపురం శివారు గణేశ్ నగర్‌లో గురువారం జరిగిందని తెలిసింది. గ్రామానికి చెందిన రైతు గంట కోటి కథనం ప్రకారం.. కోటి తన ఎద్దులను ఉదయం వ్యవసాయ భూమి వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని అడవి జంతువు ఎద్దుపై దాడి చేసి గాయపర్చింది. ఎద్దుపై అడవి జంతువు దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

చెక్కు అందజేత

వర్ధన్నపేట : మండలంలోని డీసీ తండా పరిధిలోని శ్రీ తులసి మహిళా గ్రూప్ అధ్యక్షురాలు అంగోలు అమ్మి, సీఓ సరిత దుర్వినియోగం చేసిన డబ్బులకు సంబంధించి పోలీసుల సమక్షంలో సభ్యులకు గురువారం చెక్కు అందజేశారు. తమకు తెలియకుండా సంఘం పేరుతో మోసపూరితంగా బ్యాంకు నుంచి రుణం తీసుకుని దుర్వినియోగం చేశారని సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రమంలో పోలీసుల విచారణలో ఈ మేరకు వారు చెక్కు ఇచ్చారు. తొలుత అమ్మి, సరిత పోలీసుల సమక్షంలో నేరం అంగీకరించారు. నెల రోజుల్లోగా డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

టెండర్ వాయిదా

పర్వతగిరి : మండలంలోని అన్నారం దర్గా టెండర్ వాయిదా పడింది. అన్నారం గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకుల సూచనతో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రక్రియలో ఎవరు కూడా టెండర్ వేయలేదు. అధిక ధరకు టెండర్ వేసి భక్తులను ఇబ్బందులకు గురి చేయొద్దని అఖిల పక్ష నాయకులు ఎరగాని మనోహర్, షబ్బీర్, గొడుగు భిక్షపతి, సాంబయ్య, రామసాని కృష్ణ, రాపోలు యాకయ్య, గౌస్, తదితరులు కోరారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

వర్ధన్నపేట : తన భూమిలో తన అత్త చేపట్టిన ఇందిరమ్మ ఇంటి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన బానోతు హుస్సేన్ స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. బతుకుదెరువు కోసం తాను విజయవాడలో కుటుంబంతో నివాసం ఉంటుండగా తనకు సంబంధించిన భూమిలో తన అత్త అజ్మీరా హస్లి అక్రమంగా నిర్మాణం చేపట్టిందని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ సెక్రటరీల ఎన్నిక

నర్సంపేట/నర్సంపేట రూరల్ : నర్సంపేట–ఖానాపూర్, చెన్నారావుపేట–నెక్కొండ మండలాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) జోనల్ సెక్రటరీలుగా కందుల స్వామి, వీరగోని స్వప్న ఎన్నికయ్యారు. నర్సంపేటలోని బాయ్స్ హైస్కూల్‌లో ఎంఈఓ కొర్ర సారయ్య అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో స్వామిని, చెన్నారావుపేట మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ బైరి సరళ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికలో వీరగోని స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వామిని, స్వప్నను ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడారు. విద్యార్థులను జిల్లా,



నర్సంపేట : స్వప్నను సన్మానిస్తున్న ఎంఈఓ

రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా సెక్రటరీ సారంగపాణి, రిటైర్డ్ పీఈటీ రామదాసు, ఫిజికల్ డైరెక్టర్లు దేవీలాల్, పీఈటీలు సుధాకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు దీరిన రైతులు



గోదాము ఎదుట క్యూ కట్టిన రైతులు

ఖానాపురం : యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్న దుస్థితి మండలంలో నెలకొంది. మండలంలోని ధర్మారావుపేట సొసైటీ గోదాము వద్ద రైతులు గురువారం ఉదయం నుంచి బారులు తీరారు. గోదాముకు 888 బస్తాలు రాగా ఒక్కో రైతుకు రెండు చొప్పున అధికారులు అందజేశారు. యూరియా లభించక పలువురు రైతులు వెనుదిరిగారు. యూరియా కోసం రైతుల పిల్లలు (విద్యార్థులు) సైతం క్యూలో నిలబడ్డారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్ మాట్లాడారు. మరో రెండ్రోజుల్లో మళ్లీ యూరియా వస్తుందని తెలిపారు. రైతులందరికీ యూరియా ఇస్తామని చెప్పారు.

హెల్త్ కార్డుల పంపిణీ

గీసుకొండ : మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్ విద్యార్థులకు కిశోర రక్ష హెల్త్ కార్డులను వైద్యులు గురువారం పంపిణీ చేశారు. వైద్యుల బృందం విద్యార్థులకు పలు రకాల ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి సూచనలు చేసింది. హెల్త్ కార్డులను వినియోగించుకుని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన చికిత్సను ఉచితంగా పొందవచ్చని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శౌర్య శరణ్య, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ఖానాపురం : ఈనెల 11న హనుమకొండలోని వెయ్యి స్తంభాల ఆలయం నుంచి నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా ఇన్‌చార్జ్ రజనీకాంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర తలపెట్టినట్లు పేర్కొన్నారు.


చికిత్స పొందుతున్న యువకుడి మృతి

గీసుకొండ : మండలంలోని మొగిలిచర్ల శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటకు చెందిన పోషాల రాజు (47) గురువారం మృతి చెందాడు. రాజు ఈనెల 2న ప్రమాదానికి గురి కాగా ఆయన్ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. బ్రెయిడ్ డెడ్‌గా నిర్ధారించారు. రాజు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు పాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని..

వర్ధన్నపేట : బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా.. జఫర్‌గఢ్ మండలంలోని సాగరం గ్రామానికి చెందిన పద్మ మోహన్‌రావు దంపతులు బైక్‌పై వెళ్తుండగా వ్యవసాయ కూలీలతో వస్తున్న బొలెరో ఢీకొట్టింది. మోహన్‌రావు తలకు తీవ్రగాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య పద్మకు గాయాలు కాగా అమెను వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాయపర్తి : మండలంలోని కొండూరు పీఎంశ్రీ జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సొంత డబ్బుతో సమకూర్చిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం పద్మలత మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, ఆచార్య, రఘు, శ్యామ్ సుందర్, సత్యనారాయణ, భోజ్యా, అనితా రాణి, శ్రీదేవి, నాగరాజు, స్వామి, శివకృష్ణ, రాధిక, గాడిపెల్లి రాజు, రమ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరం



నర్సంపేట రూరల్ : చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ మధురిమ

- ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ

నర్సంపేట రూరల్ : తల్లిపాలు శిశువుకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ తెలిపారు. నర్సంపేట మండల పరిధిలోని మాధన్నపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మధురిమ ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు తాగించాలని చెప్పారు. ఆర్నెళ్లపాటు తల్లి పాలు అందించాక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం కూడా చిన్నారులకు అందించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అక్షర్యాభాస్యం, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు నర్సంపేట మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలోని ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషన్, గైనకాలజిస్టు నిర్మల కుమారి, డాక్టర్ వనిత, డాక్టర్ సుస్మిత, బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, కోఆర్డినేటర్ పుట్ట రవి, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నూనె కవిత, కూనమల్ల స్వరూప, భూక్య సరిత, ఆయాలు పెండ్యాల జ్యోతి, మాలోతు జ్యోతి, ఆగమ్మ, వీఓ అధ్యక్షురాలు సరస్వతి, ఏఎన్‌ఎం రాణి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని కల్లెడ–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీరజ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలిత, రాణి, పద్మతదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, మొరిపిరాల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు వడగం మంజుల, నాగపురి అరుణ అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఏఎన్‌ఎం సంధ్యారాణి, వీరమ్మ, అంగన్‌వాడీ ఆయమ్మలు రోజా, తల్లులు అశ్విని, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సిబ్బంది దృష్టికి తీసుకురావాలి

- డీఈలు ఆనందం, భిక్షపతి

రాయపర్తి : విద్యుత్ సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆ శాఖ డీఈలు ఆనందం, భిక్షపతి కోరారు. మండలంలోని పెర్కవేడులో గురువారం నిర్వహించిన పొలం బాట కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లోని స్టార్టర్లు, విద్యుత్ మోటార్ల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. లూజ్‌లైన్‌లో 3 మిడిల్ పోల్స్, నూతన జీఐ ఎర్త్‌వైర్లు ఏర్పాటు చేశారు. ఏబీ స్విచ్, డీటీఆర్ స్ట్రక్చర్‌లను సరిదిద్దడంతోపాటు 5 లూజ్ స్పాన్‌లను సవరించారు. అలాగే 8 సీపీవీసీ స్పేసర్లను లూజ్ లైన్లలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఈ నటరాజ్, ఏఈ రవళి, సబ్ ఇంజినీర్



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

విక్రమ్, సిబ్బంది భూక్య కిషన్, భీమా, అనిల్, రామకృష్ణ, ప్రవీణ్, కాంట్రాక్టర్ నవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ జిల్లా కార్యదర్శి సతీష్

వర్ధన్నపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జడ సతీష్, అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని కట్ర్యాల, కడారిగూడెం గ్రామాల్లో బూత్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నాంపల్లి కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ‘ఇంటింటికీ బీజేపీ–ప్రతి ఇంటికీ బూత్ అధ్యక్షుడు’ కార్యక్రమానికి సతీశ్, మహేందర్‌రెడ్డి హాజరై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు చిక్కొండ రాజు, పింగిళి రాజేందర్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, బూత్ సభ్యులు కిరణ్‌తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సతీశ్, నాయకులు

ముందస్తు రాఖీ వేడుకలు



నర్సంపేట రూరల్ : కమ్మపల్లి హైస్కూల్‌లో రాఖీలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట/నర్సంపేట రూరల్/పర్వతగిరి : నర్సంపేట, పర్వతగిరి మండలాల్లో పలు చోట్ల గురువారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. నర్సంపేటలోని రామాలయం స్కూల్, అంగన్‌వాడీ విద్యార్థులకు బ్రహ్మకుమారీ కేంద్ర నిర్వాహకులు జ్యోతి రాఖీ కట్టారు. అలాగే నర్సంపేట మండలంలోని కమ్మపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి సందడి చేశారు. పర్వతగిరిలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డికి ఏఏపీసీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయినులు రాఖీ కట్టారు. కార్యక్రమాల్లో సీడీపీఓ మధురిమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, హెచ్‌ఎంలు శోభ, భిక్షపతి, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, పద్మ, జ్యోతి వాణి, సరళాదేవి, శశిధర్, కుమార్, రమేశ్, గణేశ్, ప్రసాద్, సుభాషిణి, రామస్వామి, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.